క్లుప్తంగా

నేషనల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు ఏయూ రిజిస్ట్రార్

ఏయూ క్యాంపస్: న్యూఢిల్లీలో జరుగుతున్న నేషనల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ ఆన్ కామర్స్ అండ్ అకౌంటెన్సీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ హాజరయ్యారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ), అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) సంయుక్తంగా రెండు రోజు ల సదస్సును న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రముఖ విద్యాసంస్థల నుంచి సీనియర్ విద్యావేత్తలు, పరిశోధకులను ఈ సదస్సుకు ఆహ్వానించారు. ఏయూ నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సదస్సుకు హాజరయ్యారు. సోమవారం ప్రారంభమైన ఈ సదస్సుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఉపాధ్యక్షుడు ఆచార్య దీపక్ కుమార్ శ్రీవాత్సవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు హాజరైన ఏయూ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన 27వ జాతీయ యువజన ఉత్సవం(నేషనల్ యూత్ ఫెస్టివల్-2024)లో పాల్గొన్నారు. వారిని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఏయూ పరిధి లోని ఆరుగురు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఒక ప్రోగ్రాం అధికారి ఈ నెల 12 నుంచి 16 వరకు జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతో మధుమేహం నియంత్రణ

బీచ్ రోడ్డు: ప్రపంచ వ్యాప్తంగా పట్టి పీడిస్తున్న మధుమేహాన్ని ఆహారపు అలవాట్లు మార్పుతో నియంత్రించవచ్చునని ఆయుర్వేద నిపుణులు మధుమిత అన్నారు. జాతీయ బాదం దినోత్సవం సందర్భంగా సోమవారం ఓ హోటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమిత మాట్లాడుతూ రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. బాదం తదితర డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉన్న ఆహారం తీసుకోవడం మేలన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్త రోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయాలని ఆలయ అధికారులు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం


మృతదేహం

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్, డీ కేబిన్ మధ్యలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృదేహాన్ని గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 40 ఏళ్ల గల వ్యక్తి ట్రాక్‌పై మృతి చెంది ఉన్నాడు. అతడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. 5.5 అడుగుల ఎత్తుకలిగి, లేత నీలం రంగు టీషర్టు, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి గుర్తించిన వారు ఎస్ఐ బాలాజీరావు 96661227222, సీఐ సీహెచ్ ధనుంజయనాయుడు 9440627547 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.



ఆరిలోవ రహదారులకు మహర్దశ


కొత్తగా నిర్మాణం చేపట్టనున్న పెదగదిలి నుంచి తోటగరువు మధ్య శిథిలమైన బ్రిడ్జి

- రూ.11.49 కోట్లతో తోటగరువు వద్ద బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం
- నేడు భూమి పూజ చేయనున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని
- ఇప్పటికే కోట్లాది నిధులతో పూర్తయిన పలు అభివృద్ధి పనులు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరిలోవ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఇప్పటికే అన్ని కాలనీలలో రూ.కోట్ల నిధులతో రోడ్లు, కాలువల నిర్మాణం, రహదారుల విస్తరణ, గెడ్డల ఆధునీకీకరణ, బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణం, సామాజిక భవనాలు, కల్యాణ మండపాల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇటీవల సూర్యతేజానగర్‌లో సుమారు రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు. మారో రూ.6 కోట్లతో బాలాజీనగర్‌లో జీవీఎంసీ కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పుడు తాజాగా మరో రూ.11.49 కోట్లతో ఓ బ్రిడ్జి నిర్మాణంతో పాటు సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం, కాలువలు, ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఆ పనుల కోసం మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ భూమి పూజ చేయనున్నారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రూ.3.45 కోట్లతో పెదగదిలి–తోటగరువు బ్రిడ్జి

పెదగదిలి బీఆర్‌టీఎస్ కూడలి నుంచి తోటగరువు వెళ్లే మధ్యలో పెద్ద గెడ్డపై ఉన్న బ్రిడ్జి శిథిలమైంది. ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్న ఈ బ్రిడ్జిని ఇప్పుడు తొలగించి కొత్తగా నిర్మాణం చేపట్టనున్నారు. దీన్ని విస్తరించి ఇరుపక్కలా పాత్‌వేలు నిర్మించనున్నారు. దీని కోసం జీవీఎంసీ రూ 3.45 కోట్ల నిధులు కేటాయించింది. ఈ పనులకు మంగళవారం శంకుస్థాపన జరగనుంది.

రూ.3.76 కోట్లతో కాలువలు, ఫుట్‌పాత్‌లు

బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు కిలోమీటరు పైగా కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. దీని కోసం జీవీఎంసీ అధికారులు రూ.3.76 కోట్లు కేటాయించారు. ఈ పనులకు కూడా మంగళవారం శ్రీకారం చుట్టనున్నారు.


బ్రిడ్జి పనులకు ఆటంకం కలగకుండా పొక్లెయిన్‌తో గెడ్డలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

రూ.1.75 కోట్లతో బీటీ రోడ్డు

బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు కిలోమీటరు పైగా రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ మీడియా(డివైడర్), వీధి దీపాలు ఏర్పాటు చేపట్టనున్నారు. దీని కోసం జీవీఎంసీ అధికారులు రూ.1.75 కోట్లు కేటాయించారు. ఈ పనులకు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు.

రూ.2.53 కోట్లుతో బీటీ రోడ్డు, క్రాస్ కల్వర్టు, డివైడర్

సూర్యతేజానగర్ బ్రిడ్జి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు బీటీ రోడ్డు, కాలువలు, ఫుట్‌పాత్‌లు, పార్వతినగర్ వద్ద క్రాస్ కల్వర్టు విస్తరణ, డివైడర్, వీధి దీపాల నిర్మాణం చేపట్టనున్నారు. ఇందు కోసం జీవీఎంసీ అధికారులు రూ.2.53 కోట్లు కేటాయించారు. ఈ పనుల కోసం మంగళవారం శంకుస్థాపన జరగనుంది.

విశాఖ అభివృద్ధే ధ్యేయం



విశాఖ అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారు. అధిక శాతం మంది పేదలు నివసిస్తున్న ఆరిలోవ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధే దీనికి నిదర్శనం. ఇప్పటికే కొన్ని కోట్ల జీవీఎంసీ నిధులతో ఆరిలోవ ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పుడు మరో రూ.11.49 కోట్లు జీవీఎంసీ నిధుల తో అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేయనున్నాం. పెదగదిలి, తోటగరువు మధ్య బ్రిడ్జి, పెదగదిలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రోడ్డు, కాలువలు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, వీధి దీపాలు, ఫుట్‌పాత్‌లు, సూర్యతేజానగర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు బీటీ రోడ్డు, కాలువలు, ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియా, క్రాస్ కల్వర్టు తదితర పనులకు శ్రీకారం చుడతాం.

– గొలగాని హరివెంకటకుమారి, నగర మేయర్,

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు


ఆదర్శనగర్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు పేదలకు మేలు చేకూర్చుతున్నాయని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన పాదయాత్ర నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి ఎంపీ ఎంవీవీ వార్డులోని 22, 23 నంబర్ల సచివాలయం పరిధి ఆదర్శనగర్, ఇందిరాగాంధీనగర్, రాజీవ్‌నగర్‌లలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి గురించి ఆరా తీశారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఎంపీ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమ పథకాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేపడుతున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయన్నారు. అందుకే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, బీసీ విభాగం డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు, వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, స్థానిక నాయకులు పతివాడ కనకరాజు, బొండా శ్రీనివాసరావు, కె.ఎస్.చలం, వైదా నారాయణరావు, కె.ఆర్.కె.ప్రసాద్, మొల్లి వెంకటరమణ, వరలక్ష్మి, కాంతం, నారాయణమ్మ, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా రవాణా వినియోగంతో కాలుష్య నివారణ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని కొంత వరకు నివారించవచ్చునని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఏపీఎస్ ఆర్‌టీసీ బస్సులో, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


ఆర్టీసీ బస్సు దిగుతున్న మేయర్ హరి వెంకట కుమారి


సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి శుభాకాంక్షలు


వీసీ ప్రసాదరెడ్డికి మొక్కను బహూకరిస్తున్న జీవీఎంసీ స్టాఫ్-వర్కర్స్ యూనియన్ నాయకులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీగా ఇటీవల నియమితులైన ఆచార్య ప్రసాదరెడ్డిని సోమవారం జీవీఎంసీ స్టాఫ్-వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.వి.వామనరావు ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు శాలువతో సత్కరించారు. మొక్కను బహూకరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, యూనియన్ ప్రతినిధులు డి.పోలారావు, కె.ఎల్లయ్య, గొలగాని ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.


వీసీతో పోలీసు అధికారులు

ఏయూవీసీ ప్రసాద రెడ్డిని అభినందించిన పోలీసు ఉన్నతాధికారులు

వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని పలువురు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. సోమవారం వీసీని తన కార్యాలయంలో డీసీపీలు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసరావు, తూర్పు ఏసీపీ మూర్తి, మూడో పట్టణ సీఐ కోరాడ రామారావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విశాఖ న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షుడు జి.ఎం.రెడ్డి, న్యాయవాదులు ఎస్.ఎస్.వాసు, ఇమంది చిన్నారావు, సి.వి.ఎస్.ఎల్.రాజు, ఎన్.కాళిదాసురెడ్డి, తదితరులు.. వీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పురస్కార గ్రహీతలకు అభినందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి, వలంటీర్లకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయి. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, గైట్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల విద్యార్థిని డి.లక్ష్మీశ్రీలేఖ రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 12న జరిగిన కార్యక్రమంలో వారు అవార్డులను స్వీకరించారు. ఈ మేరకు సోమవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అవార్డు గ్రహీతలను అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.


పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

‘పది’లో నూరు శాతం ఫలితాలే లక్ష్యం

- విద్యార్థులకు డీఈవో చంద్రకళ సూచన
- డాబాగార్డెన్స్ మున్సిపల్ హైస్కూల్ సందర్శన

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఈ ఏడాది పదో తరగతిలో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా చదవాలని డీఈవో ఎల్.చంద్రకళ విద్యార్థులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం ఆమె డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ఆమె ముఖాముఖి మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆమె తరగతుల జరుగుతున్న తీరును, విద్యార్థుల హాజరు, తదితర వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ఎస్ నాగభూషణంను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పదో తరగతి సిలబస్ పూర్తయిందని, పాఠాలు పునశ్చరణ చేసుకోవాలన్నారు. అనుమానాలు ఏమైనా ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టును ప్రణాళికాబద్ధంగా చదివి నూరు శాతం మార్కులు సాధించాలన్నారు.


విద్యార్థులకు సూచలిస్తున్న డీఈవో ఎల్.చంద్రకళ

గంజాయితో ఇద్దరి అరెస్ట్

గోపాలపట్నం: నెల్లూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏడు కిలోల గంజాయి తరలిస్తుండగా గోపాలపట్నం రైల్వేట్రాక్ పక్క రోడ్డులో టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వివరాలు.. అరకు ప్రాంతంలో కొనుగోలు చేసిన గంజాయిని బ్యాగుల్లో నెల్లూరు తరలించేందుకు యత్నిస్తున్నారు. వీరు గోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక రోడ్డులో వెళుతుండగా వచ్చిన పక్కా సమాచారంతో పట్టుకున్నారు. వారి నుంచి 7 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ప్రాంతానికి చెందిన ఎస్. నవీన్, పి సురేష్‌గా గుర్తించారు. గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంతా రామమయం

- అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవ వేళ పులకించిన భక్తజనం
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు


ఆరిలోవలో జైశ్రీరామ్ జెండాలతో ర్యాలీకి బయలు దేరుతున్న భక్తులు

ఆరిలోవ: అయోధ్య రామ మందిరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా తూర్పు నియోజకవర్గంలో సోమవారం శ్రీరామ నామ స్మరణ మార్మోగింది. రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన బృందాలు రామనామ జపంతో నియోజకవర్గంలో రామాలయాలకు తిరుగుతూ ప్రత్యేక హారతులు చేపడుతూ సంకీర్తనలు ఆలపిస్తూ అందరిలో భక్తి భావం నింపారు. ఆరిలోవ, విశాలాక్షినగర్ ప్రాంతాలలో రామాలమాల్లో భక్తులు పూజలు చేశారు. కాషాయం కండువాలు మెడలో వేసుకొని రాముని ఫొటోలతో ర్యాలీలు నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతం నెహ్రూనగర్‌లో శివాలయం, సూర్యతేజానగర్‌లో పోలమాంబ ఆలయం వద్ద రాముని ప్రతిమలకు పూజలు చేశారు. ఎస్ఐజీ నగర్‌లో రామాలయం, విశాలాక్షి నగర్‌లోని బీవీకే పాఠశాలలో రాముడికి పూజలు జరిపారు.

శ్రీరాముని పల్లకి సేవ

ఆరిలోవ: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా జీవీఎంసీ 10వ వార్డులో ఆదర్శనగర్ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముని పల్లకి సేవ నిర్వహించారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని భక్తులతో కలసి పల్లకి మోశారు.

అన్నమయ్య ప్రాంగణంలో..

బీచ్ రోడ్డు: ఆర్కే బీచ్‌లోని అన్నమయ్య ప్రాంగణంలో శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మంది మహిళలు హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణాలు చేశారు. కోలాటాలు, రామనామ సంకీర్తనలతో సాగర తీరంలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ట్రస్ట్ డైరెక్టర్ సునీత కొఠారి, గ్రంధి రాజేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డు ఆదర్శనగర్‌లో..

ఎంవీపీ కాలనీ: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట జరగడం ఆనందదాయకమని 17వ వార్డు ఆదర్శనగర్ మహిళలు అన్నారు. ఈ విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని కాలనీలోని మహిళలు ప్రతి ఇంటికి ర్యాలీగా వెళ్లి ముత్తయిదువులకు కుంకుమ సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకురాలు పిల్లా సత్యవతి, స్థానిక మహిళలు సుశీల, సత్య, రాణి అంకమ్మ, ఎర్రమ్మ, మోహినమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ శోభాయాత్ర

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ హనుమత్ లక్ష్మణ సమేత సీతారామ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా సాగింది.


ఆర్కే బీచ్ అన్నమయ్య ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న మహిళలు


టీటీడీ కల్యాణ మండపంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, భక్తి గీతాలు అలరించాయి.

ఎంవీపీ కాలనీ: సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాములకు దీపాలంకరణ సేవ నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో సీతారాములు భక్తులకు దర్శనమిచ్చారు.

లలితాపీఠంలో..

ఏయూ క్యాంపస్: స్థానిక కిర్లంపూడి లేఅవుట్‌లో ఉన్న లలితా పీఠంలో కోదండరామునికి విశేష పూజలు నిర్వహించారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ట జరుగుతున్న సమయంలో లలితా పీఠం శ్రీరామ నామ జపంతో మార్మోగింది. డాక్టర్ చిట్టి పంతులు, ఇతర భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మద్దిలపాలెం : పిఠాపురం కాలనీలోని ఆటో స్టాండ్ వద్ద అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాముని చిత్ర పటానికి పూలమాలలు వేసి, పానకం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బొట్టా వెంకటరమణ, ఆటోస్టాండ్ ప్రతినిధులు పాల్గొన్నారు. పిఠాపురం కాలనీలోని మాజీ ఎమ్మెల్సీ మాదవ్ ఇంటి వద్ద అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భారీ ర్యాలీ నిర్వహించారు. ఇసుకతోట రామాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, భక్తులు పాల్గొన్నారు.

కళాభారతిలో..

మద్దిలపాలెం : స్థానిక కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ సంయుక్తంగా అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రత్యక్షం ప్రసారం చేశారు. రాముని కీర్తనలు ఆలపిస్తూ తరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సి.ఎస్.ఎన్.రాజు, రామకృష్ణ మిషన్ స్వామి, కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, సుసర్ల రామ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


ఆదర్శనగర్‌లో రాముని పల్లకీ మోస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ


17వ వార్డు ఆదర్శనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


ఎంవీపీ సెక్టార్-6లోని వెంకన్న ఆలయంలో దీపాల అలంకరణ


లలిత పీఠంలో పూజలు చేస్తున్న భక్తులు


పిఠాపురం కాలనీ ఆటో స్టాండ్ వద్ద అయోధ్య వేడుకలు